కరాటే శిక్షణ.. ఆత్మ రక్షణ

- మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ
- మూడు నెలలపాటు తర్ఫీదు
- ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెంపు

Sunday Special

పెద్దవంగర: బాలికలపై దాడులు అరికట్టేందుకు స్వీయరక్షణ పద్ధతులు ఎంతో ఉపయోగ పడతాయి. ఈనేపథ్యంలో విద్యాశాఖ 6నుంచి 14ఏళ్ల లోపు బాలికలకు ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అదేశాలు జారీ చేసింది. బాలికలు అత్యాచారాలు, దాడుల నుంచి తమకు తాము రక్షించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ కరాటే శిక్షణ తరగతులు విజయవంతంగా సాగుతున్నాయి. గ్రామీణ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, ఆత్మరక్షణకు ఉపయోగపడేందుకు కరాటే శిక్షణను విద్యాశాఖ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో కరాటే మాస్టర్‌తో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.


బొమ్మకల్లులో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

మండలంలోని మొత్తం 34 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 05 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 05 ప్రాథమికోన్నత పాఠశాలలు, 22ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. జ్యోతిరావ్ పూలే బీసీ గురుకులంతోపాటు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ఉంది. ఆయా పాఠశాలల్లో బాలురు 1,167, బాలికలు 756 మొత్తం 1,923 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా 6,7,8,9 తరగతుల్లో మొత్తం 368 మంది బాలికలకు ఆయా పాఠశాలల్లో కరాటేలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆపద సమయాల్లో ఆత్మరక్షణ మెళకువలు, ఏకాగ్రత, పట్టుదల పెరిగేలా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థినులు రెట్టింపు ఉత్సహంతో కరాటేలో శిక్షణ పొందుతున్నారు.

ఉత్సాహంగా నేర్చుకుంటున్నాం..



విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. శిక్షణలో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. కరాటే నేర్చుకోవడంతో ఆత్మస్థైర్యం కలుగుతోంది. అనుకోని ఆపద సంభవించినప్పుడు ధైర్యంగా ఎదుర్కోగలం. - బుద్ద శుభాంగిని, 9వ, తరగతి, విద్యార్థిని

ఆత్మస్థైర్యం పెరుగుతోంది..



విద్యార్థులకు కరాటే నేర్పించడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతోంది. కరాటేను పాఠశాలల్లో విద్యార్థులు ఎంతో శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. ఎవరైన దాడులు చేస్తే ఎలా స్పందించాలి, ఎలా తిప్పికొట్టాలో తెలుస్తోంది. - లీలా శోభారాణి, హెచ్ఎం, బొమ్మకల్లు

క్లుప్తంగా

బీజేపీ సంబురాలు



సాక్షి నెట్‌వర్క్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి, ఆప్ పార్టీపై ఘన విజయం సాధించడంపై శనివారం బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయి పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ రావడం ఖాయం అన్నారు.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: గూడురు మండలం దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్‌పాయిజన్‌తో ముగ్గురు విద్యార్థులు వాంతులు, విరోచనాలుకు బాధ్యులైన వార్డెన్, సంబంధిత వంట మనుషులపై చర్య తీసుకోవాలని లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు గుగులోతు శివవర్మ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సమావేశంలో జవరలాల్, తరుణ్‌నాయక్, వంశీ, ఉపేందర్, రమేష్ నాయక పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు

మరిపెడ రూరల్: మండలంలోని ఆర్జేఆర్ఎం డిగ్రీ కళాశాలలో క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహించిన బ్లాక్‌స్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా కబడ్డీ బాలికల పోటీల్లో ఎల్లంపేట ప్రథమ, వీరారం ద్వితీయ స్థానంలో గెలుపొందారు. వాలీబాల్ బాలుర పోటీల్లో మరిపెడ, విస్సంపల్లి ప్రథమ, ద్వితీయ స్థానంలో గెలుపొందగా వీరికి కళాశాల ప్రిన్సిపాల్ బానోతు లక్‌పతి బహుమతులు ప్రదానం చేశాడు. కార్యక్రమంలో బానోతు వీరన్న నాయక్, లునావత్ అఖిల్‌నాయక్ పాల్గొన్నారు.

ఇంటి స్థలం కబ్జాకు యత్నం

మహబూబాబాద్ రూరల్: తమ ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్య తీసుకోవాలని, మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన నీలం కృష్ణయ్య, కుటుంబ సభ్యులు గ్రామంలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. 1999 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన నూకల ముత్తయ్య వద్ద గుంట ఇంటి స్థలాన్ని రూ.5వేలకు కొనుగోలు చేశామన్నారు. కాని ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన కొం తమంది కలిసి రాజకీయ పలుకుబడితో బెదిరిస్తూ ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన అధ్యక్షుడిగా గంధసిరి జ్యోతిబసు, కార్యదర్శిగా పట్ల మధులను ఎస్ఎఫ్ఐ జిల్లా నాలుగో మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు శనివారం తెలిపారు.

ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి మంచ్యాతండాలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, క్రీడా సాంస్కృతిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వచ్చిన మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, మాజీ ఎంపీ కవితకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఎం (సీఎస్) సబావత్ కృష్ణవేణి, టీడబ్ల్యూ గురుకులం సెక్రటరీ డీఎస్ వెంకన్న పాల్గొన్నారు.

బడిలో చేర్పించండి

కేసముద్రం: మీ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, వెంటనే బడిలో చేర్పించాలంటూ మండలంలోని మహముద్‌పట్నం ఉమ్మడి జీపీ పరిధిలో గల ఓ ఇటుక బట్టిలో పనిచేస్తున్న ఒడిశా కార్మికులకు స్థానిక యుపీఎస్ హెచ్ఎం ఎం.సురేష్‌నాయుడు, సీఆర్పీ సుల్తానా శనివారం సూచించారు. ఈమేరకు ఈ పిల్లలు వచ్చే సోమవారం నుంచి బడికి రానున్నట్లు వారు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ముల శ్రీను ఇటీవల ప్రమాదంలో పక్కటెముకలు విరిగి అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెల్సుకున్న మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి వైద్య ఖర్చుల నిమిత్తం వారి ఇంటికి వెళ్లి రూ.5 వేలు అందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: మెనూ ప్రకారం రుచికరంగా నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని దామరవంచ గిరిజన గురుకుల విద్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా తరగతి గదులు తిరుగుతూ విద్యార్థులతో వారి సమస్యలను అడిగి తెల్సుకున్నారు. అనంతరం వంటగదిని, సరుకుల నిల్వ, వంట తయారీని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైనారు. గురుకుల విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులు, వార్డెన్, ఇతర పనిమనుషులు వారి వారి విధుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, అర్రెం వీరస్వామి, రమేష్ అధికారులు పాల్గొన్నారు.


గూడూరు: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కంకర అయ్యప్పరెడ్డి, గొల్లపల్లి రజనీకాంత్, సిరిపురం వీరన్న, పడిశాల వెంకన్న, సురుగు రంగన్న పాల్గొన్నారు.

విద్యా రంగానికి బడ్జెట్ పెంచాలి

మహబూబాబాద్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యకు 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని హామీ మేరకు విద్యకు బడ్జెట్ పెంచాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్య పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కమిటీ మానుకోట శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్నిరంగాలతోపాటు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం వార్షిక బడ్జెట్ ఫిబవరి నెలలో ప్రవేశపెట్టబోతుందని దానిలోనైనా విద్యకు పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడంలేదు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: కాంగ్రెస్‌ను దేశ ప్రజలు విశ్వసించడంలేదని, ఢిల్లీ ఎన్నికల్లో ఇది తేటతెల్లమైందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా బీజేపీని గెలిపిస్తూ వస్తున్నాడన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గాడిద గుడ్డు మిగిలిందని ఎద్దేవ చేశారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమార్తి సీతారాములు, మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మాజీ జెడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, పోనుగోటి సోమేశ్వర్ రావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10వ తేదీన వివిధ రకాల కంపెనీల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.బాబు శనివారం తెలిపారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులందరికీ అవకాశం ఉందని, అప్రెంటీస్ ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు www. upprentic-erhipind-ia.orf.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అప్రెంటీస్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత ఆధార్‌కార్డు, పాస్ ఫొటోలు, ఐటీఐ పాసైన అన్ని జిరాక్స్ పత్రాలతో ఈనెల 10వ తేదీన ఉదయం 11గంటలకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు మానుకోటలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలను సంప్రదించాలన్నారు.

నిధుల కేటాయింపులో అన్యాయం

కేసముద్రం: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కనీస కేటాయింపులు లేవంటూ కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎంసీపీఐ(యూ), ఏఐసీటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొల్లోజు రామ్మోహనాచారి, దారావత్ రమేశ్, వీరస్వామి, రాజు, వెంకన్న, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కురవి: శాసన మండలిలో బీఆర్ఎస్ విప్‌గా నియమితులై తొలిసారి కురవికి వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు కార్యకర్తలు బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని అర్చన నిర్వహించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు నాగయ్య, నరహరి, బోడ శ్రీను, కిశోర్‌వర్మ, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం పోరాటం చేస్తాం..

విదేశీ విద్యతో అమెరికాలో చదువుకుంటున్న తెలంగాణకు చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పడుతున్న గోసను జూమ్ మీటింగ్‌లో ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, శాసన మండలిలో బీఆర్ఎస్ విప్ సత్యవతిరాథోడ్‌కు వివరించారు. శనివారం కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో మానుకోట మార్కెట్ మాజీ చైర్మన్ బజ్జూరి ఉమాపిచ్చిరెడ్డి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోగా ఆమెను సత్యవతిరాథోడ్ పరామర్శించారు. అమెరికాలో ఉండి స్కాలర్‌షిప్‌పై చదువుకుంటున్న అన్నికులాల విద్యార్థుల కోసం పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

చిన్నారి వైద్యానికి రూ.3.20లక్షల సాయం

కేసముద్రం/మహబూబాబాద్: సికిల్‌సెల్ ఎనిమియాతో, కిడ్నీల ఇన్‌ఫెక్షన్‌తో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ చిన్నారి వైద్యానికి మండలంలోని కల్వల గ్రామానికి చెందిన బొగ్గుల రాజేష్, హేమలత దంపతులు పలువురి దాతల సహకారంతో సేకరించిన రూ.3.20 లక్షలను, శనివారం మండలంలోని కల్వల గ్రామంలో బాధిత కుటుంబానికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మహబూబాబాద్‌కు చెందిన గార వినోద్‌కుమార్, విజయ దంపతులకు కుమార్తె విశృత ప్రియాన్సి అనే నాలుగేళ్ల చిన్నారికి సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి మూడేళ్ల క్రితం సోకింది. ఆస్తులను అమ్ముకుని సుమారు రూ.20లక్షల వరకు ఖర్చు చేశారు. దీంతో కురవి మండల కేంద్రానికి చెందిన గంగరబోయిన రఘు అనే యువకుడు తన ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేశాడు. దీంతో స్నేహితులు స్పందించి సాయం అందించారు. కేవలం వారంరోజుల్లో బొగ్గుల రాజేష్, హేమలత దంపతులు సేకరించిన రూ.3.13లక్షలను శనివారం మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కాగా జిల్లా కేంద్రానికి చెందిన ఎండి షకీల్ చికిత్స నిమిత్తం రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశాడు.


నగదు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి, తదితరులు

గుడుంబా తయారు చేస్తే చర్యలు

గూడూరు: గుడుంబా తయారు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ జి.సూర్యప్రకాష్, ఎక్సైజ్ సీఐ ఎన్. భిక్షపతి హెచ్చరించారు. మండలంలోని ఎర్రకుంటతండా, సురేష్‌నగర్ తండాలలో శనివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడిగా గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 400లీటర్ల బెల్లంపానకం, 10లీటర్ల నాటుసారా, 30కిలోల నల్లబెల్లం, 2కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రకుంటతండాకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్సై ఎస్.రాజేశ్వరి, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


దాడులు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రేమించి.. మోసం చేశాడు

- ప్రభుత్వ ఉద్యోగం రాగానే ముఖం చాటేసిన యువకుడు
- మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్న వైనం

మరిపెడ రూరల్: ప్రభుత్వ ఉద్యోగం రాగానే పది సంవత్సరాలుగా ప్రేమించిన యువతిని కాదన్నాడు ఓ యువకుడు. కోటి రూపాయల ఆఫర్‌తో మరో యువతితో నిశ్చితార్థం కుదిర్చుకున్న విషయం తెలిసి తాను నమ్మి మోసపోయానని గుండెలవిసెల యువతి రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ హృదయ విదారక సంఘటన మహబూబాబాద్ మరిపెడ మండలంలో చోటు చేసుకుంది. బాధిత యువతి, ఆమె బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని గుర్రప్పతండా గ్రామ పంచాయతీకి చెందిన ఓ యువతి అదే మండలంలోని భూక్యతండాకు చెందిన దూరపు బంధువు అయిన భూక్య రాజేందర్ ప్రేమించుకున్నారు. వీరిరువురు హైదరాబాద్‌లో చదువుకుంటు 2015 నుంచి 2025 జనవరి నెల వరకు సుమారు 10 సంవత్సరాలు వీరి మధ్య ప్రేమప్రయాణం నడిచింది. వారిద్దరి ఒప్పందం మేరకు యువతి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ రాజేందర్ చదువుకోసం రూ.8లక్షలు ఆర్థిక సాయం అందించింది. ఆరు నెలల క్రితం సదరు యువకుడికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్టీపీసీ చెన్నైలో చార్టెడ్ అకౌంటెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం రాగానే యువకుడు ప్రేమించిన యువతికి ముఖం చాటేశాడు. జనగామకు చెందిన మరో యువతితో కోటి రూపాయల ఆఫర్ రాగానే నిశ్చిదార్థం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి ఈనెల 6న మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో శనివారం ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్ ఎదుట ఘర్షణకు దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుట యువతి రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.


మరిపెడ పోలీస్ స్టేషన్ ఎదుట రోదిస్తున్న యువతిని ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు

అక్రమంగా గోవుల తరలింపు

పెద్దవంగర: గోవులను అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనం పట్టుపడిన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పాలకుర్తి-నాంచారిమడూర్ రహదారిపై తమ సిబ్బంది పాట్రోలింగ్ నిర్వహిస్తుండగా తొర్రూరు మండలంలోని గుడిబండతండా గ్రామ మరిధిలోని గుండ్యతండాకు చెందిన బానోతు నారాయణ అతడి స్నేహితుడు వరంగల్ జిల్లా రాయపర్తి మండల బాలునాయక్‌తండా పరిధి గోప్యతండాకు చెందిన భూక్య రాములు ఇద్దరు కలిసి అశోక లేలాండ్ వాహనంలో ఆరు గోవులను తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నవాబుపేటకు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి గోవులను స్వాధీనం చేసుకొని వాటి సంరక్షణ నిమిత్తం వర్థన్నపేట బృందావన గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జీల తనిఖీ

కురవి: మండల కేంద్రంలోని ప్రైవేట్ వసతి గృహాలు(లాడ్జీలు) ఏఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

గడ్డివాము దగ్ధం

నెల్లికుదురు: ప్రమాదశాత్తు గడ్డివాము దగ్ధం అయిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేడి మానేందర్ తన ఇంటి ఆవరణంలో సుమారు రూ.50వేల విలువ చేసే 500 వందల మొపుల గడ్డిని వామిగా పెట్టాడు. ప్రమాద శాత్తు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆదుపులోకి తీసుకువచ్చారు.

స్వయంపాలన దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సోమ గోవర్ధన్, ఉపాధ్యాయులు వేణు గోపాల్, సత్యనారాయణరెడ్డి, కృష్ణవేణి, సుధాకర్, షమీం పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం క్లెం వీరారెడ్డి, టీచర్లు గోపి, స్వరూప, మోహనకృష్ణ, శ్రీదేవి, హరికృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

గార్ల: గార్ల పట్టణంలోని వివిధ కూడళ్లలో ఓవర్ లోడ్‌ను నివారించేందుకు గాను 4 కొత్త 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు మహబూబాబాద్ విద్యుత్‌శాఖ డీఈ విజయ్ తెలిపారు. ఈమేరకు గార్ల చాపల మార్కెట్ బజారులో కొత్తగా ఏర్పాటు చేసిన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

శేషవాహన ఊరేగింపు

డోర్నకల్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వరస్వామిని శేషవాహనంపై ఊరేగించారు. ఊరేగింపు అనంతరం ఆలయంలో సామూహిక సహస్ర నామార్చన, తీర్థ ప్రసాదగోష్టి నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

స్థలాన్ని ఆశ్రమ స్కూల్‌కు ఇవ్వాలి

కురవి: మండల కేంద్రంలో కూల్చివేసిన జెడ్పీ హైస్కూల్‌లో కొంత స్థలాన్ని పక్కనే ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు ఇవ్వాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంగీత, రమాదేవి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తోబుట్టుకు ఆలయం గొప్ప విషయం

మరిపెడ రూరల్: బంధాలు అంతరించిపోతున్న తరుణంలో మృతి చెందిన తోబుట్టుకు ఆలయం కట్టి పూజలు చేయడం ఎంతో గొప్ప విషయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి గ్రామ శివారు జర్పులతండాలో నూతనంగా నిర్మించి అచ్చమ్మబాయి ఆలయాన్ని యుగేందర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆగపేట టు తిరుపతి

దంతాలపల్లి: మండలంలోని ఆగపేట గ్రామానికి చెందిన నూకల గౌతంరెడ్డి అనే భక్తుడు శనివారం గ్రామం నుంచి తిరపతికి కాలినడకన వెళ్లాడు. ఏడోసారి నడిచి తిరుపతి వెళ్తున్నట్లు తెలిపాడు.

సెలవుదినంగా ప్రకటించాలి

గార్ల: ఈనెల 15న సంత్ సేవాలాల్ జయంతి రోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని కోరుతూ శనివారం మంత్రి డి శ్రీధర్‌బాబుకు లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ వినతిపత్రం అందజేశారు.

ఏసుక్రీస్తు ఆరాధనతో మేలు

మహబూబాబాద్ రూరల్: ప్రభువైన ఏసుక్రీస్తు ఆరాధనతో సర్వ మానవాళికి మేలు జరుగుతుందని వాక్యోపదేశకులు బ్రదర్ జాకబ్ రోస్, బ్రదర్ ప్రభాకర్ పొట్టేటి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్షద్దాయి చర్చి 33వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్ గ్రామంలో గల శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఇటీవల నూతనంగా శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయం ప్రారంభం కాగా ఆలయ నిర్మాణకర్త యాస వెంకటరెడ్డి మొదటి శనివారం పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని భగవంతుడి సేవలో తరించారు.

ఆలయాన్ని సందర్శించిన నల్లాన్ వంశస్తులు

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని సుప్రసిద్ధ మాకుల వేంకటేశ్వర స్వామివారిని నల్లాల వంశస్తులు అయిన రిటైర్డ్ ప్రొఫెసర్ చింత పట్టణ గోమటం బాబురమాదేవి, ఆస్ట్రాలజీ బురుగడ్డ హరికుమారరా చార్యులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చక్రవర్తి లక్ష్మణ చార్యులు వారిని పెరుమళ్ల శేష వస్త్రాలను అందజేశారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

దంతాలపల్లి: ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండంలోని బీరిశెట్టి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీరిశెట్టి గ్రామానికి చెందిన మిడుతపల్లి ఉప్పలమ్మ(48), ఉప్పలయ్యకు సుమారు 30సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి మృతి చెంది ఉంది. మృతురాలి సోదరుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జన్నయ్య తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

కురవి: గ్రామానికి మూడు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలందించాడు.. ఒక సారి ఉప సర్పంచ్, కురవి సొసైటీ చైర్మన్‌గా పనిచేశాడు. సొసైటీలో అనేక పర్యాయాలు డైరెక్టర్‌గా, మానుకోట ఆఫీసర్స్ క్లబ్ శాశ్వత కార్యదర్శి, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడిగా పనిచేసిన కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన యర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి(76) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. సుధాకర్‌రెడ్డికి ఇద్దరు కుమారులు రాజేశ్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి -రచనారెడ్డి(ప్రముఖ న్యాయవాది), కుమార్తె రోహిణి ఉన్నారు. సుధాకర్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యా నాయక్, బండి పుల్లయ్య, జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, గుడిపూడి నవీన్‌రావు, తదితరులు నివాళులర్పించారు. కాగా 25 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన మృతుడి కుమార్తె రోహిణి తండ్రి చనిపోయాక వచ్చి మృతదేహంపై పడి రోధించింది.

అధిక సాంద్రత పద్ధతులు పాటించాలి



మరిపెడ రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో పత్తిపంటలో రైతులు అధిక సాంద్రత పద్ధతులు పాటించి సాగు చేపట్టాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోర్డినేటర్ డాక్టర్ మాలతి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని గిరిపురం రైతువేదికలో అధిక సాంద్రత పత్తిసాగు, యాజమాన్యపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ఆధ్వర్యంలో రైతు సోదరులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మాలతి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తిలో అధిక సాంద్రత పద్ధతి పాటించి తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచి, పంట కాలాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కిశోర్ కుమార్, అధికారి బోడ వీరసింగ్, ఏఈవోలు శ్వేత, సైదమ్మ, ప్రసాద్, సాయిశృతి పాల్గొన్నారు.